


లింగ నిర్ధారణ చేస్తే జైలుకే

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి లక్ష్మీకుమారి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేస్తే జైలు శిక్ష తప్పదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీకుమారి తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నివారణ చట్టం పై శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లో జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని నిరోధించడానికి 1994లో పార్లమెంట్ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం చేసిందన్నారు. కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణులు సాయి భార్గవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



వీరఘట్టం.. పొలంలో వరికుప్పలు వేస్తున్న రైతులు

వరిచేను రోడ్డుపైకి చేర్చి టార్పాలిన్ కప్పిన రైతులు

అకాల వర్షం..

అన్నదాత కలవరం

గతంతో పోలిస్తే కాస్త దిగుబడి పెరిగిందన్న అన్నదాత ఆనందంపై అకాల వర్షం నీళ్లు చల్లింది. తుపాను కారణంగా గత మూడు రోజులుగా వర్ష సూచన కనిపించడంతో అన్నదాతకు కంటి నిండా కునుకు లేకుండా పోయింది. మాండాస్ తుపాను శుక్రవారం రాత్రి తీరం దాటుతున్న నేపథ్యంలో సాయంత్రం నుంచి జిల్లా అంతటా స్వల్ప వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో అన్నదాత తీవ్రంగా కలత చెందుతున్నాడు. పొలాల్లో ఉన్న వరిచేలు కుప్పలుగా పెట్టేందుకు ఉరుకులు, పరుగులు తీశారు. అయినా జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులకు చెందిన వరిచేలు ఇంకా పొలాల్లోనే ఉండిపోవడంతో తడిచిపోయాయి. దీంతో వరి చేలు మొలకలు నాటుతాయని రైతులంతా ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది

వరి కుప్పలు వేసేందుకు ఉరుకులు పరుగులు



జియ్యమ్మవలస.. ఆరబోసిన ధాన్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వరి రైతులకు ఇది చేతికందే సమయం. విజయనగరం ఉమ్మడి జిల్లాలో సుమారు 4లక్షల ఎకరాలకు పైగా వరి సాగైంది. ఎకరాకు 21క్వింటాలు బస్తాల దిగుబడి వస్తోంది. ఇది గత ఏడాదితో పోలిస్తే 3క్వింటాళ్లు బస్తాలు అధికమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 15రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 60 శాతం కోతలు పూర్తయ్యాయి. వర్ష సూచన వల్ల చాలా మంది కోతలు వాయిదా వేసుకున్నారు. ఇప్పటికే కోసిన చేనును పొలంగట్లపై దిబ్బలు పెట్టుకుంటున్నారు. ఈలోపు శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో రైతులు విస్మయానికి గురయ్యారు. పార్వతీపురం మన్యంజిల్లా పాలకొండ, సీతంపేట, భామిని, సీతానగరం, విజయనగరం జిల్లాలోని విజయనగరం, గజపతినగరం, గరివిడి, చీపురుపల్లి, మెంటాడ, వేపాడ, వంగర, భోగాపురం, డెంకాడ, జామి, నెల్లిమర్ల, బొబ్బిలి తదితర అన్ని ప్రాంతాల్లోనూ స్వల్ప వర్షం కురిసింది.

వర్షసూచన పోయేవరకు గుండె నిబ్బరంగా ఉండలేమని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షంతో తడిసిన వరి చేలకు ఎకరాకు పది ట్యాంకులు, ప్రతి ట్యాంకుకు 500గ్రాముల చొప్పున (5శాతం) ఉప్పు ద్రావణాన్ని కంకిలపై పిచికారీ చేస్తే మొలకరాకుండా కాపాడుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంకా వీలైతే టార్పాన్లు కప్పడం కూడా ఎంతో మేలని సూచించారు.



నెల్లిమర్ల.. సతివాడలో వరిచేను కుప్పలు పెడుతున్న రైతులు

సఖి గ్రూపులతో సామాజిక మార్పు

వర్క్‌షాప్‌లో కలెక్టర్ ఎ.సూర్యకుమారి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

సఖి గ్రూపులకు వివిధ అంశాలపట్ల సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా సామాజికంగా మార్పు తెచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపు నిచ్చారు. యునిసెఫ్ సహకారంతో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సఖి కౌమార బాలికల వర్క్‌షాపు స్థానిక ఎస్‌విఎన్ హోటల్‌లో శుక్రవారం జరిగింది. వర్క్‌షాప్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, నడవడిక, విద్య, ఉపాధి, వ్యక్తిగత రక్షణ, వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించేందుకు సఖి గ్రూపులు ఒక వేదికగా ఉన్నాయని అన్నారు. ఈ గ్రూపులను ఆలంబనగా చేసుకొని, సమాజ దృక్పథంలో మార్పును తీసుకురావాలని కోరారు. ప్రస్తుత సమాజంలో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు ఇటువంటి వర్క్‌షాపులు దోహదపడతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు సఖి గ్రూపులు కృషి చేయాలన్నారు. కేవలం వైద్యం, ఇంజనీరింగ్ మాత్రమే విద్య కాదని, విస్తృతంగా ఉన్న విద్యావకాశాలను వివరించాలని కోరారు. ప్రతి ఒక్కరికీ శారీరక ధారుఢ్యం అవసరమని, దీనికోసం ఆటలాడటం, ఎక్సర్‌సైజులు, యోగా నేర్పించాలని సూచించారు. జిల్లాను వెంటాడుతున్న రక్తహీనత, సికిల్ సెల్ ఎనీమియా, తలసేమియా లాంటి వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. బాలురకు కూడా గ్రూపులను ఏర్పాటు చేసి, పలు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి మాట్లాడుతూ సఖి కార్యక్రమ ఉద్దేశ్యాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. బాలికలకు వివిధ అంశాలపై అవగాహనతో పాటు భావ వ్యక్తీకరణ కూడా అవసరమని పేర్కొన్నారు. ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళా జాతాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యునిసెఫ్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ కౌమార బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యపరమైన అంశాలు, వారి రక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలను వివరించారు. ఉత్తమ సఖి గ్రూపులకు మొమెంటోలను కలెక్టర్ అందజేశారు. పోస్టర్లను ఆవిష్కరించారు. వర్క్‌షాపులో సిపిఒ పి.బాలాజి, అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు, యునిసెఫ్ కన్సల్టెంట్ కె.శివకిషోర్, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ అశోక్, పలువురు డాక్టర్లు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాశాలను సందర్శించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జోన్ 1,2 ఉన్నత విద్యా శాఖ ప్రాంతీయ విద్యా సంచాలకులు సిహెచ్. కృష్ణ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో వివిధ విభాగాలను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. అధ్యాపకుల కొరత సమస్యను తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై ఉన్నత విద్యాశాఖలో ప్రవేశ పెట్టిన వివిధ యాప్‌ల అవశ్యకత గురించి వివరించారు. మారుతున్న కాలంతో పాటు అధ్యాపకులు నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆంగ్ల అధ్యాపకుడు డాక్టర్ సి.వి.యస్. రవీంద్రనాధ్ రచించిన ఆంగ్ల స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు ఆధ్వర్యంలో ఆర్జెడి సిహెచ్ కృష్ణ లాంచనంగా విడుదల చేసి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వాసుదేవ రావు, శ్రీలక్ష్మి, వలీఖాన్, శ్రీనివాసరావు, సంధ్యారాణి విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

రాష్ట్రానికి పట్టిన శని వైసిపి

'ఇదేం కర్మ'లో బుద్దా వెంకన్న

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రానికి పట్టిన శని వైసిపి ప్రభుత్వమని టిడిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్, టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న దుయ్యబట్టారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా టిడిపి ఆధ్వర్యాన నగరంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కనపాకలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, యువత కోసమే చంద్రబాబు ఆలోచిస్తారని, అందుచేతనే 200 రూపాయల ఉన్న పింఛను 10రెట్లు పెంచి రూ.2వేలు చేశారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను ఇబ్బందులు పెట్టడమే పనిగా పెట్టుకుని నిత్యావసరాల ధరలు, మద్యం, పన్నులు వంటివి 10రెంట్లు పెంచి పేదల నడ్డివిరిచారని విమర్శించారు. ఈ జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎప్పుడు ఇంటికి పంపించాలా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. జగన్ అసమర్థ పాలనతో "మాకేంటి ఈ ఖర్మ" అని బాధపడుతున్నారని విమర్శించారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం

సమాజంలో ఉండే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని జిల్లా పరిషత్ సిఇఒ డాక్టర్ అశోక్ కుమార్ అన్నారు. స్థానిక యూత్ హాస్టల్ వేదికగా రెండో విడత ఆపద మిత్ర శిక్షణ శుక్రవారం ప్రారంభమయ్యింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలోని తోటి వారికి ఎలాంటి ఆపదొచ్చినా ఆదుకునే మంచి మనస్తత్వాన్ని అందరూ అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలు, కరోనా వంటి మహమ్మారి ప్రమాదాల నుంచి సమాజాన్ని రక్షించే సేవామూర్తులుగా ఆపద మిత్రలను ఆయన అభివర్ణించారు. జిల్లాలో 10 వేల మంది ఔత్సాహికులు ఉండగా అత్యంత ఆసక్తి కలిగిన 100 మందిని రెండో దఫా శిక్షణకు ఎంపిక చేశామని గుర్తు చేశారు. శిక్షణ కాలంలో మిత్రలకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ మోహన్, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ రాజ్ కుమార్, ఆపద మిత్ర శిక్షణా విభాగం మేనేజర్ దేముడు, ఎన్‌డిఆర్‌ఎఫ్., ఎస్‌డిఆర్‌ఎఫ్. ప్రతినిధులు పాల్గొన్నారు.

సిఎం జన్మదినం సందర్భంగా జెపిఎల్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 50వ జన్మదినం సందర్భంగా నగరంలో క్రికెట్ క్రీడాకారుల కోసం జగనన్న ప్రీమియర్ లీగ్(జెపిఎల్) నిర్వహించనున్నట్లు వైసిపి సీనియర్ నాయకులు అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన తెలిపారు. శుక్రవారం జెపిఎల్ టీషర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని 50 డివిజన్లలో 50 టీం లతో నిర్వహించనున్న ఈ పోటీల్లోఉత్సాహవంతులైన క్రీడాకారులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోటీలు ఈనెల 11 నుండి 20 వరకు స్థానిక అయోధ్యా మైదానంలో జరుగుతాయని తెలిపారు. 20న ఫైనల్స్‌తో పాటు ముగింపు వేడుకలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఫైనల్ లో గెలుపొందిన జట్టు ట్రోఫీతో పాటు రూ.50వేలు క్యాష్ ప్రైజ్, 2 వ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25వేలు క్యాష్ ప్రైజ్ అందిస్తామని తెలిపారు. టోర్నీలో పాల్గొనే అన్ని జట్లకూ ఉచిత ప్రవేశంతో పాటు, టీ షర్టును కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కాళ్ళ గౌరీ శంకర్, డిసిఎంఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



చెన్నుపాటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

చెన్నుపాటి త్యాగాలు మరువలేనివి

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య త్యాగం మరువలేనిదని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి అన్నారు. ఉపాధ్యాయుల స్థితిగతులను మార్చిన గొప్ప నాయకుడని, విద్యారంగంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు తెలియచేస్తూ చైతన్య పరచడంలో గొప్ప కృషి చేసారని కొనియాడారు. చెన్నుపాటి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి విద్యారంగంలో వస్తున్న సంక్షోభాలను ఐక్య ఉద్యమాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విద్యలో సామాజిక న్యాయం కోసం పోరాడాలని, విద్యా హక్కు చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని దీనికోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, మధుసూదనరావు, నాయకులు కృష్ణదాసు, రమేష్, పోలినాయుడు, రమేష్, అజయ్ కుమార్ , రామకృష్ణ పాల్గొన్నారు.

తహశీల్దార్ శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన

పాడేరు ఐటిడిఎ పిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం



శ్రీనివాసరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శంకర్రావు, సురేష్

విజయనగరం సివిల్ సప్లయ్ విభాగంలో పనిచేస్తూ ఈ మధ్యనే అల్లూరు సీతారామరాజు (పాడేరు) జిల్లా పెదబయలు తహశీల్దార్ గా బదిలీపై వెళ్లిన ఒ.శ్రీనివాస రావు ఆత్మహత్యకు కారణమైన పాడేరు ఐటిడిఎ పిఒపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు అంత్యక్రియలు శుక్రవారం నగరంలోని కొత్తపేటలో జరిగాయి. శ్రీనివాసరావు మృతదేహాన్ని డిఆర్‌ఒ గణపతిరావు, పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్య దర్శి రెడ్డి శంకరరావు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన ఆత్మహత్య కు ప్రధాన కారణం ఐటిడిఎ ఇపో గోపాలకృష్ణ కారణమని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలినపారు. ఇటీవల జరిగిన కలెక్టర్ సమావేశంలో భూసర్వే వివరాలు సక్రమంగా చెప్పలేదని పిఒ సహోద్యోగుల మధ్యే శ్రీనివాసరావును మందలించడంతో మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు అర్ధమవుతున్నదని తెలిపారు. తహశీల్దార్ మృతికి కారణమైన ఐటిడిఎ పిఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం శ్రీనివాసరావు కుటుంబాన్ని అన్ని రకాల ఆదుకోవాలని కోరారు.

ముగిసిన బ్యాడ్మింటన్ జోనల్‌స్థాయి పోటీలు

విజేత విశాఖ జిల్లా జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెండు రోజులు గా స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగిన సిఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో విన్నర్ గా విశాఖపట్నం, రన్నర్‌గా విజయనగరం జిల్లాల జట్లు నిలిచాయి. గెలుపొందిన జట్లు రాష్ట్ర పోటీల్లో పాల్గొన నున్నాయి. విజేతలను చీఫ్ కోచ్ అప్పలనాయుడు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు

11న వైసిపి విస్తృత సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఈనెల 11న వైసిపి జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, రాష్ట్ర, జిల్లా స్థాయి ఛైర్మన్లు, మేయర, మున్సిపల్ చైర్మన్లు, డైరెక్టర్లు హాజరవుతారని తెలిపారు. విజయవాడలో జరిగిన జయహో బిసి మహాసభను విజయవంతం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

అమ్మో.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం!

- కమీషన్ ఇస్తేనే ఫైలు కదలిక
- స్థలం ఏదైనా రిజిస్ట్రేషన్‌కు బాదుడే
- కార్యాలయం చుట్టూ డాక్యుమెంటు రైటర్లే

ప్రజాశక్తి- గుర్ల, నెల్లిమర్ల



నెల్లిమర్ల మండల కేంద్రంగా నడుస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలంటే సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నా చితకా రిజిస్ట్రేషన్లకు కూడా వేలల్లో వసూలు చేయడమే దీనికి కారణం. ప్రభుత్వం పెంచిన డాక్యుమెంటేషన్ ఫీజు సరేసరి. దానికి సమానంగా సబ్ రిజిస్ట్రార్‌కు కూడా కమీషన్ ఇవ్వాలని వసూలు చేయడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ లావాదేవీలన్నీ చూసేందుకు సబ్ రిజిస్ట్రార్ తన సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు డాక్యుమెంటు రైటర్లను ఏర్పాటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరు ముగ్గురూ తమ వద్దకు వచ్చిన కొనుగోలు, అమ్మకం దారుల నుంచి వేలల్లో వసూలు చేసి అందులో 80 శాతం నగదను సబ్ రిజిస్ట్రార్‌కు ఇస్తున్నట్లు సమాచారం.

నెల్లిమర్ల, గుర్ల మండలాలకు కలిపి నెల్లిమర్లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గతంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ నెలకు అన్ని రిజిస్ట్రేషన్లు కలుపుకుని సుమారు 500 నుంచి 600 వరకూ జరుగుతాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ. కోటి వరకూ ఆదాయం వస్తుంది. ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంతో పోటీ పడి సబ్ రిజిస్ట్రార్ కూడా వసూలు చేస్తున్నట్లు తెలిస్తోంది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అంటేనే భయం

వాస్తవానికి నెల్లిమర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గతంలో మంచి పేరుండేది. గతేడాది నుంచి అక్కడ బాధ్యతలు తీసుకున్న సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారిని పీడించడంతో ఆ పేరు కాస్త నాశనమై అక్కడ రిజిస్ట్రేషన్లు అంటేనే భయపడు తున్నారు. దీంతో చాలా మంది ఈ రెండు మండలాల్లో క్రయ విక్రయాలకే భయ పడుతున్నట్లు చెబుతున్నారు. మరి కొంత మంది భూములు కొనుగోలు చేసినా సబ్ రిజిస్ట్రార్ మారిపోయిన తరువాత రిజిస్ట్రేషన్ చేసుకుందాంలే అని వాయిదాలూ వేసుకుంటున్నట్లు తెలిస్తోంది. సబ్ రిజిస్ట్రార్ తన సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు రైటర్లను తన చుట్టూ పెట్టుకుని భారీగా వసూలు చేస్తున్నట్లు తెలిస్తోంది. ముగ్గురులో ఒక వ్యక్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆనుకుని ఒక ఇంట్లో వ్యవహారం నడిపించగా మిగిలిన ఇద్దరు నెల్లిమర్ల-పాలకొండ రహదారిని ఆనుకుని ఎదురెదురుగా కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారు కచ్చితంగా ఈ ముగ్గురులో ఎవరో ఒకరి వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు తీసుకోవాల్సిందే. దీన్నే అదునుగా తీసుకుని వేల రూపాయలు వసూలు చేస్తున్నారు.

ఉదాహరణకు ఇటీవల గుర్ల మండలం గూడేం వద్ద 200 గజాల స్థలాన్ని నెల్లిమర్లకు చెందిన ఒక వ్యక్తి కొనుగోలు చేశాడు. దీనికి గాను రిజిస్ట్రేషన్ నిమిత్తం ప్రభుత్వానికి అతను సుమారు రూ.10,424 చెల్లించాడు. ఇవి కాకుండా రిజిస్ట్రేషన్ ఖర్చులు పేరిట ముగ్గురిలో ఒక డాక్యుమెంటు రైటర్ కొనుగోలు దారుడి నుంచి మరో రూ. 6500 వసూలు చేశాడు.

ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ. 3వేలకు పైగానే రాబడి?

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏ చిన్న రిజిస్ట్రేషన్ జరిగినా సబ్ రిజిస్ట్రార్‌కు కనీసం రూ.3వేలు ఇవ్వాల్సిందే. ఇలా రోజుకు ఈ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సుమారు 20 నుంచి 25 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. నవంబరు 1 నుంచి డిసెంబరు 1 వరకూ ఇక్కడ 544 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇందులో 135 రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ. 1.47కోట్లు ఆదాయం వచ్చింది. ఇది కాకుండా సబ్ రిజిస్ట్రార్‌కు డాక్యుమెంటు ఖర్చుల పేరిట వసూలు చేసింది లక్షల్లోనే ఉంటుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేల డాక్యుమెంటు ఖర్చులు ఇవ్వకపోతే అటువంటి రిజిస్ట్రేషన్లకు ఏదో ఒక వంక పెట్టి పెండింగ్‌లో పెట్టేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు బహిరంగంగానే బాధితులు చెబుతున్నారు.

11న టెన్నిస్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

కొత్తవలస : ఈ నెల 11 ఉదయం 9 గంటలకు స్థానిక ప్రగతి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ జిల్లా టీమ్ సెలక్షన్ జరగనుందని పీడీ జి రవికుమార్ శుక్రవారం తెలిపారు. 2023 జనవరి 10వ తేదీ నుంచి 12వతేదీ వరకూ ఏలూరు జిల్లా చింతలపూడిలో జరగనున్న 8వ రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ జరగనుందన్నారు. దీనికి జిల్లా జట్టును ఇక్కడ ఎంపిక చేస్తామన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

భోగాపురం : భోగాపురం పంచాయతీ, మధుర గ్రామాలు అప్పన్నపేట, కొయ్యపేట, కారిగొల్లపేట, సుందరపేటలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జనసేన నాయకులు ఉపతహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందించారు. పేదలకు ఇల్లు కట్టుకోవడానికి ఉపయోగపడే భూమిని ఇవ్వాలని, వారికి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పల్ల రాంబాబు, పిడుగు జోగారావు, వెంకటేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుపరిపాలన బాధ్యత సర్పంచులదే

మెరక ముడిదాం : గ్రామ పంచాయతీలలో సుపరిపాలన అందించే భాధ్యత సర్పంచులదేనని ఎంపిడిఒ పి. రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సూచనలు ప్రకారం ప్రతి ఒక్కరూ గ్రామాలలో తిరుగుతూ ప్రజలకు వున్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ బి. శ్రీదేవి మాట్లాడుతూ మండలంలో అంగన్వాడీ కేంద్రాలు పనితీరు, తీసుకుంటున్న జాగ్రత్త చర్యలు గురించి వివరించారు.

నాడు-నేడు పనులు పరిశీలన

వేపాడ : మండలంలో బక్కు నాయుడుపేట కస్తూరిబా బాలికల వసతి గృహం, చినదుంగాడ, చిన్న గుడిపాల ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు నేడు పనులను ఎంఇఒ జి. శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. అనంతరం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి నాడు నేడు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కెజిబివిలో జరుగుతున్న పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల యూనిట్లు పంపిణీ

వంగర : మండలంలోని మద్దివలసలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ చేతుల మీదుగా మహిళా సమాఖ్య సంఘాలకు శుక్రవారం పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 గ్రామాలలో సంఘానికి ఐదు చొప్పున 150 యూనిట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంలు చక్రపాణి, గోవిందరావు క్లస్టర్ కోఆర్డినేటర్ త్రినాధ రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులు ఆపాలి

భోగాపురం : పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నివారణ, నిషేధం పరిహారం వేధింపుల చట్టం 2013 అనే అంశంపై అంగన్వాడి కార్యకర్తలకు ఐసిడిఎస్ పిఒ జె. సుగుణవతి ఆధ్వర్యంలో ఎంపిపి ఉప్పాడ అనూష శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ముందు ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి పద్మావతి, ఎంపిడిఒ డి బంగారయ్య, హౌసింగ్ ఎఇ రాము, వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, వెలుగు ఎపిఎం రమణ, ఏఎన్ఎంలు, అంగన్వాడి సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

13న రైతు కోసం తానా

శృంగవరపుకోట: తానా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన పట్టణంలోని ఆకుల డిపో వద్ద రైతు కోసం తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తాన సభ్యుడు గొంప కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఒక ప్రైవేటు హాల్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా భారతదేశంలో తానా చైతన్య స్రవంతి ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగంగా డిసెంబర్ నెలలో రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా తానా ప్రెసిడెంట్ లావు అంజయ్య చౌదరి పర్యవేక్షణలో ఈనెల 13వ తేదీన పట్టణంలోని ఆకుల డిపో వద్ద ఉచిత క్యాన్సర్ క్యాంపు నిర్వహించి వేల రూపాయలు ఖర్చు అయ్యే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయడం జరుగుతుందని చెప్పారు. రేలారే రేలా సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

నగర పంచాయతీలో 'ఇదేం కర్మ రాష్ట్రానికి'

నెల్లిమర్ల : నగర పంచాయతీ పరిధిలోని 4వ వార్డులో టిడిపి ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించింది. పట్టణ పార్టీ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు పాల్గొని మాట్లాడారు. వైసిపి అధికారం చేపట్టి మూడున్నర సంవత్సరాల కాలంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. అభివృద్ధి కుంటుపడి రహదార్లు కూడా శిథిలావస్థకు చేరాయన్నారు. కాబట్టి వచ్చే ఎన్నికల్లో అధికార వైసిపికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదేల రాజారావు, లెంక అప్పలనాయుడు, విమలారాణి, గురాన అసిరి నాయుడు, పొడుగు కృష్ణ వేణి, నాయకులు ముడు మంచి లక్ష్మణ రావు, తదితరులు పాల్గొన్నారు

నాటుసారా నివారణకు ఆపరేషన్ పరివర్తన

బొబ్బిలి రూరల్ : మండలం పరిధిలోని గోపాలరాయిడుపేట పంచాయతీ కృపావలసలో నాటుసారా నివారణపై గ్రామస్తులకు 'ఆపరేషన్ పరివర్తన' పేరిట శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యాన మదర్ థెరిస్సా సేవా ట్రస్ట్ తో కలసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ నాటుసార తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా తాగటం వలన కలిగే కష్ట, నష్టాలను వివరించారు. అనంతరం పేదలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు, పండ్లను మథర్ థెరిస్సా సేవా ట్రస్ట్ సభ్యులు అందించారు.

నిధుల సమీకరణకు ప్రణాళికలే కీలకం

రామభద్రపురం : గ్రామాల అభివృద్ధికి పంచాయతీ పాలకవర్గం ముందస్తు ప్రణాళిక తయారు చేసుకోవాలని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ డెవలప్ ప్లాన్ ఓరియెంటేషన్ మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీలు 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి పథకం, వివిధ ప్రభుత్వ నిధుల సమీకరణ, వాటితో పంచాయతీల అభివృద్ధికి చేపట్టబోయే పనులను గుర్తించి ఖర్చు చేసే విధానం ప్రణాళికలను రూపొందించడంపై అవగాహన కల్పించారు. సమావేశంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, వైస్ ఎంపిపి పెంకి అరుణ, బెల్లాన ప్రసాదరావు, ఎంఇఒ తిరుమలప్రసాద్, పిఆర్ ఎఇ జె.రమేష్, ఇఒపిఆర్‌డి ఎం.వెంకటరమణ, కార్యాలయ పర్యవేక్షకుడు రామలింగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సుందరీకరణకు అనుమతులివ్వాలి

బొబ్బిలి : స్టేట్ బ్యాంకు సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం పరిసర ప్రాంతాన్ని సుందరీకరణ చేసేందుకు అనుమతులు ఇవ్వాలని టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, కౌన్సిలర్లు కె.లక్ష్మి, వి.హైమవతి, మాజీ కౌన్సిలర్లు సుంకరి సాయిరమేష్, కాకల వెంకటరావు కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం పరిసర ప్రాంతాన్ని సుందరీకరణ చేసేందుకు టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన సొంత నిధులను ఖర్చు చేస్తారన్నారు. అందుకోసం అనుమతులివ్వాలని కోరారు.

నేటి నుంచి రామాయణంపై శిక్షణ

విజయనగరం కోట : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణం ప్రాంగణంలో ఈనెల 10 నుంచి మూడురోజులు పాటు 'తవాస్మి: జీవన వేదం - రామాయణం'పై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తవాస్మి రూపకర్తలు, ఐఐటి ప్రొఫెసర్లు ఆర్.శ్రీరామ చక్రధర్, ఎ.శారదా దీప్తి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రామనారాయణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా విద్యార్థులకు శిక్షణనిచ్చే మెటీరియల్ తో కూడిన పుస్తకాలను ఎన్‌సిఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మనిషికి మానవత్వానికిమధ్య పెరుగుతున్న అగాధాన్ని తగ్గించి, వ్యక్తిలో వ్యక్తిత్వపు వెలుగులు నింపే ప్రయత్నమే 'తవాస్మి: జీవన వేదం- రామాయణం' అని పేర్కొన్నారు. పిల్లల వ్యక్తిత్వ వికాసం కోసం 'తవాస్మి' ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో హౌసింగ్ నిర్మాణాలు, అభివృద్ధి పనులు వేగవంతం కావాలని మండల ప్రత్యేకాధికారి, గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్.వి. రమణ మూర్తి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఎండిఒ గిరిబాల ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గృహ నిర్మాణాలు, నాడు నేడు పాఠశాల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వార పనులు గుర్తించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాలని, జగనన్న కాలనీలకు విద్యుత్, రోడ్డు సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి హెచ్.భానోజీ రావు, హౌసింగ్ డిఇ మురళీ మోహన్, ఎఒ పూర్ణిమ, ఎపిఒ జి. అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

కొత్తవలస: మండలంలో ఇల్లు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.పాపారావు తెలిపారు. ఉత్తరాపల్లి గ్రామంలో ఎంపిడిఒ అధ్యక్షత హౌసింగ్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాపల్లి రెండు లేఔట్‌లలో కాలని నిర్మాణాలు నత్తనడకన నడుస్తున్నాయని, లబ్ధిదారులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్, విద్యుత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామభద్రపురం: గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి ప్రవేశాలకు సిద్ధం చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు లబ్ధిదారులను కోరారు. హౌసింగ్‌డే సందర్భంగా శుక్రవారం కొట్టక్కి, మిర్తివలస గ్రామాల్లో జగనన్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు ఏదైన సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ఈనెల 22నాటికి ప్రభుత్వం నిర్దేశించిన సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధమవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ గణపతిరావు, హౌసింగ్ ఎఇ సత్యారావునాయుడు, ఉపాధిహామీ సహాయ సంచాలకురాలు కోట సుశీల, వెలుగు ఎపిఎం గాడి వెంకటరమణ, గృహ నిర్మాణశాఖ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి - వంగర

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు తొమ్మిది నెలలుగా ఇవ్వాల్సిన వేతన బకాయిలను వెంటనే విడదల చేయాలని గ్రీన్ అంబాసిడర్లంతా సంతకవిటి మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇవ్వకుండానే వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారన్నారు. వేతనాలు నెలల కొద్దీ బకాయి ఉంటే కార్మికుల కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించార. రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా గ్రామ పంచాయతీలపై ఆ భారాన్ని మోపి జీవో ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. పంచాయతీ ద్వారా వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని, పంచాయతీలకు కార్మికులకు మధ్య తగువులు పెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరైన పద్ధతి కాదని తీవ్రంగా విమర్శించారు. అనంతరం రాజాం ఎంపిడిఒకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు కొయ్యాన అసిరప్పడు, వాసు, లక్ష్మణరావు, అచ్యుతరావు, తౌడు, లక్ష్మణ, వీరాస్వామి, కమయ్య, మహేష్, అప్పయ్య, వేను, తదితరులు పాల్గొన్నారు.



వంగర : నిరసన తెలుపుతున్న గ్రీన్అంబాసిడర్లు

మెంటాడ: మండలంలో గ్రీన్ అంబాసిడర్ల, మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రాకోటి రాములు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్‌లకు 16 నెలలగా జీతాలలేక నానా అవస్థ లు పడుతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు పెరుగుతున్న ధరలు అనుగుణంగా ధరలు పెంచేవిధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించే వరకూ ప్రభుత్వంపై ఒత్తిడి చేసి పలు రకాల ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్‌లు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు పాల్గొని సంబంధిత అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

వసతిగృహాల్లో మెస్ ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి - కొత్తవలస

సంక్షేమ వసతి గృహాల్లో మెస్ ఛార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. హర్ష డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న బిసి బాలిక హాస్టల్, ఎస్‌సి బాలుర వసతి గృహంలో కొత్తవలస మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు కంచాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎం.హర్ష మాట్లాడుతూ సుదూర ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు చదవుకోవడానికి సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటున్నారని వారికి ప్రభుత్వ విద్యను అందుకునేలా సదుపాయాలు కల్పించాల్సింది పోయి, గాలికి వదిలేశారని మండిపడ్డారు. విద్యార్థులకు సరైన పౌష్టికాహారం లేక అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందన్నారు బయట పెరిగిన సరుకుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచమని అడిగితే, అడిగిన విద్యార్థులపై, నాయకులపై నిర్బంధం విధిస్తున్నారన్నారు. సంక్షేమ హాస్టల్స్‌కి సొంత భవనాలు ఏర్పాటు చేసి, విద్యార్థులకు అండగా నిలబడాలని, అమ్మాయిలకు అవసరమయ్యే సానిటరీ న్యాప్కిన్స్ ప్రభుత్వం భాద్యతగా అందించాల్సింది పోయి విద్యార్థులను కొనుక్కునేలా చేసిందన్నారు. దీంతో విద్యార్థులు డబ్బులు లేక కొనుక్కోలేక అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం, సంక్షేమ శాఖ అధికారులు దృష్టి సారించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, అమ్మాయిలకు సానిటరీ న్యాప్కిన్స్ అందించాలని, హాస్టల్స్‌లో మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన పెద్ద ఎత్తున విద్యార్థులను కలుపుకొని పోరాటం చేస్తామని, దీనికి ప్రభుత్వమే పూర్తి భాద్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కంచాలతో విద్యార్థుల నిరసన



కంచాలతో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజలు అండగా ఉండాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

సంక్షేమం, అభివృద్ధి తన రెండు కళ్లుగా భావిస్తూ పారదర్శక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా అండగా ఉండాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శుక్రవారం 16వ సచివాలయ పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి మూడేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్, చెలికాని మురళీ కృష్ణ, వార్డు కౌన్సిలర్ చోడగంజి అనసూయమ్మ, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు చోడిగంజి రాజగోపాల నాయుడు, వాడపల్లి మనోజ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు,కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ

వేపాడ : మండలంలోని వీలుపర్తి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 7, సోంపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు7, రామస్వామి పేట సర్వే నెంబరు 20లో క్వారీలు నడిపేందుకు ప్రజాభిప్రాయ సేకరణశుశుక్రవారం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు హాజరై ఆయా గ్రామాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. దుంగాడ గ్రామానికి చెందిన వార్డు మెంబరు కాపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు చేసినప్పుడల్లా గిరిజనలకు అన్యాయం జరగకుండా చూస్తామని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుతామని, గిరిజన గ్రామానికి పాడైన రోడ్డును బాగు చేస్తామని సమావేశంలో అధికారులు క్వారీ యజమానులు చెప్పడమే తప్ప ఇప్పటివరకు రోడ్డు బాగు చేయడం గాని, మొక్కలు నాటడం గాని, స్థానికులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఉపాధి కల్పించడం కానీ, వైద్య సౌకర్యం కల్పించడం కానీ చేయలేదన్నారు. గిరిజనులు ఎవరైనా తమకు అన్యాయం జరుగుతుందని అడిగితే వారిపై తప్పుడు కేసులు పెట్టి క్వారీ యజమానులకు వత్తాసు పలుకుతున్నారని తెలియజేశారు. దీనికి స్పందించిన అధికారలు మాట్లాడుతూ తప్పనిసరిగా మీ న్యాయమైన కోరికలు అమలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మైన్స్ అధికారి మల్లేశ్వరరావు, యజమానులు బొత్స నాయుడు బాబు, రమణ మూర్తి, సిఎజి మూర్తి, శ్రీదేవి ఇండస్ట్రీ యజమాన్లు, ఆయా గ్రామాల పెద్దలు ఎస్ అప్పారావు, మురిపిండి గంగరాజు సర్పంచ్, ఎంపిటిసి ఆకుల సత్యనారాయణ, తొండవరపు రమణ, మైనింగ్ ఎడి మల్లేశ్వరరావు, వల్లంపూడి ఎస్సై రాజేష్, సోంపురం గ్రామ రెవెన్యూ అధికారి, వీలు పరితి గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- వేపాడ

బొద్దాం పిహెచ్‌సిలో శుక్రవారం డాక్టరు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో 100 గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు. ప్రతి నెల 9వ తేదీన ప్రతి గర్భిణీకి ఆరోగ్య తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయించుకోవడం వల్ల తల్లి, బిడ్డల మరణాల సంఖ్యను తగ్గించవచ్చునన్నారు. అనంతరం గర్భిణులకు భోజనాలు పెట్టారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ మూర్తి, హెచ్‌వి లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శేఖర్, వెంకట్రావు, పి.హెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస : వియ్యంపేట పిహెచ్‌సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 59 మంది గర్భిణులకు డాక్టర్ బి.సింహాద్రినాయుడు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో హైరిస్క్ గర్భిణులు 18 మంది ఉన్నట్లు తెలిపారు. బి.పి, హెచ్.బి, బ్లడ్ గ్రూప్, మూత్ర పరీక్షలు చేసి హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వారికి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ ఎక్కించారు. ఏ తల్లీ జన్మనిస్తూ మరణించకూడదని, ఏ బిడ్డా మరణించడానికై జన్మించరాదని తెలిపారు. పండ్లు, పాలు, గుడ్లు, బెల్లం, రాగి మాల్ట్, మునగాకు వంటివి తినాలని తెలిపారు. కాల్షియయ్, బి. కాంప్లెక్స్, ఐరన్ మాత్రలు ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రతీ నెల బరువులు చూసుకోవాలని తెలిపారు. 4వ నెల, 8వ నెలలో స్కాన్ చేయించుకోవాలని తెలిపారు. డెలివెరీలు ప్రభుత్వ ఆసుపత్రి లోనే చేయించాకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ జగదాంబ, హెచ్.వి. పద్మావతి, ఎల్.టి సంతోష్, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎం.ఎల్.హెచ్.పి.లు కామేశ్వరి, నాగజ్యోతి, స్వప్న, అనూష, గీతిక, ఏ.ఎన్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొండపల్లి: మండలంలోని దేవుపల్లిలో ఎంపిపి చల్లా చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. రైతు కల్లాల వద్దకే ఆర్‌బికె సిబ్బంది వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తారని ఎవరూ అధైర్య చెందాల్సిన పనిలేదని చెప్పారు. గోనే సంచులతో పాటు ధాన్యం డబ్బులు కొనుగోలు చేసిన మూడు వారాల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాపాక వెంకట లక్ష్మి, సర్పంచ్ గండ్రేటి రమణమ్మ, వైసిపి నాయకులు రాపాక సాయి, ఎఒ మల్లికార్జునరావు, తధితరులు పాల్గొన్నారు.

దేవుపల్లిలో హౌసింగ్ డే

మండలంలోని దేవుపల్లిలో శుక్రవారం నిర్వహించిన హౌసింగ్ డే కార్యక్రమానికి ఎంపిపి చల్లా చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలను ప్రారంభించకపోతే రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సకాలంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, ఎపిఎం హాజరు కాకపోవడంతో ఎంపిపి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఎంపిడిఒ వేగావతి ఆలస్యంగా వచ్చిన వారిద్దరిపైనా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

గరివిడి: చీపురుపల్లి మండలంలోని కర్లాం పిఎసిఎస్ సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, సొసైటీ అధ్యక్షులు చందక గురునాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, శ్రీను, ఎంపిటిసి బాణాన రమణమ్మ, రమణ, సొసైటీ డైరక్టర్స్, మండల వ్యవసాయాధికారి రఘునాధ్, సొసైటీ సెక్రటరీలు చందక దినేష్, వాలంటీర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నిరాశ్రయులకు రగ్గులు పంపిణీ

శృంగవరపుకోట : చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ గ్రూపు ఆధ్వర్యంలో గురువారం రాత్రి పట్టణంలోని ఫుట్ పాత్ పై చలిలో ఉన్న నిరాశ్రయులకు రగ్గులు పంపిణీ చేయడం జరిగిందని చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ గ్రూపు సభ్యుడు విన్నకోట ప్రసాద్ తెలిపారు. నిరాశ్రయుల కోసం ఏటా శీతాకాలంలో రగ్గులు పంపిణీ చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం పట్టణంలోని ఫుట్ పాత్ పై చలితో నిద్రిస్తున్న వారికి రగ్గులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూపు సభ్యులు బొడ్డేపల్లి రామకృష్ణారావు, గులిపిల్లి నరసింగరావు, వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

వైసిపి సమావేశానికి హాజరవ్వండి

వేపాడ : ఈ నెల 11న ఉదయం 10గంటలకు విజయనగరం జగన్నాథ కళ్యాణ మండపంలో జరగనున్న జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం వైసిపి మండల పార్టీ అధ్యక్షులు ఎం.జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిపిలు, జెడ్‌పిటిసిలతో పాటు సర్పంచులు, ఎంపటిసిలు, నాయకులు హాజరు కావాలని కోరారు. మరో పత్రకటనలో ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు గేదెల శ్రీనివాసరావు సమావేశాన్ని విజయవంత చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు

లక్కవరపుకోట : మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎపి మోడల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న పి హేమ ప్రసన్నకు గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రంగారాయపురం గ్రామానికి చెందిన హేమ ప్రసన్న తన సైకిల్‌పై పాఠశాలకు వెళుతుండగా సంతపేట వైపు శరవేగంగా దూసుకు వెళ్తున్న ఎపి 39 ఎన్‌పి 0198 నెంబరు గల ద్విచక్రవాహనంతో వదపురెడ్డి దినేష్ బలంగా ఢీకొట్టాడు. దీంతో విద్యార్థిని చేతిపై బలమైన గాయమైంది. క్షతగాత్రురాలిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

కాంక్రీట్ మిల్లర్‌ను ఢీకొని యువకుడు మృతి

జామి : మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన ఆళ్ల సుధీర్ (25) చిన్నాపురం జంక్షన్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మతి చెందాడు. సుదీర్ బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో చిన్నపాటి పరిశ్రమ నడుపుతున్నాడు. అక్కడి నుండి విజయనగరం వరకు రైలులో వచ్చాడు. అక్కడి నుంచి బైకుపై కుమరాం వస్తుండగా చిన్నాపురం జంక్షన్ దాటాక ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి రోడ్డు పక్కనేవున్న కాంక్రీట్ మిక్సింగ్ మిల్లర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. హెల్మెట్ ఉన్నప్పటికీ పల్టీలు కొట్టడంతో ఎగిరిపోయింది. దీంతో, తలకు బలమైన గాయమై తీవ్ర రక్తం స్రావమైంది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెడికల్ కాలేజీలోని మార్చురీకి తరలించారు.

అవినీతి పెద్ద రుగ్మత

శృంగవరపుకోట: అవినీతి అనేది ప్రపంచాన్ని పీడిస్తున్న ఒక పెద్ద రుగ్మత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని కళాశాల ఇంక్లూజివ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి అనేది ప్రపంచాన్ని పీడిస్తున్న ఒక పెద్ద రుగ్మత అని, ఈ రుగ్మతను నివారించకపోయినట్లయితే మానవ సమాజం అనేక నష్టాలకు గురికావాల్సి వస్తుందని చెప్పారు. కళాశాల ఇంక్లూజివ్ క్లబ్ కో-ఆర్డినేటర్ బి. సంధ్యారాణి మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో నేటి విద్యార్థులు యువతరం మేధావులు కీలకపాత్ర పోషించాలని అప్పుడే నీతివంతమైన సమాజం ఆవిర్భవిస్తుందని చెప్పారు. కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ సివిఎస్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలన అనేది కేవలం కరెన్సీ నోట్లకు ఆస్తులకు సంబంధించినటువంటి విషయం మాత్రమే కాదని సరైనటువంటి బాధ్యతలు నిర్వహించకపోవడం కూడా అవినీతి అని పేర్కొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి, వీలుపర్తి గ్రామాల్లో శనివారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని టిడిపి మండల పార్టీ అధ్యక్షుల గొంప వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరవుతారని మండలంలో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.